# వేతనాలు లేక విధులకు దూరం.. చెత్తతో నిండిన గూడెం సెంటర్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 14:**జీకేవీధి మండల కేంద్రంలోని గూడెం సెంటర్ చెత్తతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీకేవీధి పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పరిశుద్ధ కార్మికులకు గత ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు పది రోజులుగా విధులకు దూరంగా ఉన్నారు. దీంతో మండల కేంద్రంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది అని సిపిఎం మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు అసహనం వ్యక్తం చేశారు.ఈ విషయమై సీపీఎం మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, పరిశుద్ధ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్మికులు విధులకు దూరంగా ఉంటే స్థానిక అధికారులు పరిస్థితిని గమనిస్తూ కూడా పట్టించుకోకపోవడం విచారకరమని విమర్శించారు.చెత్త కుప్పల వద్దకు పశువులు అధిక సంఖ్యలో చేరి రహదారులపై సంచరిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి, చెత్త తొలగింపు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకుడు కొర్ర బాలయ్య పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**అర్జీల స్థితిపై 1100 టోల్‌ఫ్రీ ద్వారా సమాచారం**

**ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదుల నమోదు అవకాశం**



**అనకాపల్లి, పెన్ పవర్ జూన్ 14 :** ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఇదే సమయంలో జిల్లాలోని అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లలో సమర్పించిన అర్జీల పురోగతి, పరిష్కార స్థితి తదితర వివరాలను తెలుసుకోవడానికి అర్జీదారులు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు నేరుగా కాల్ చేయాలని కలెక్టర్ సూచించారు.

అలాగే పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లకు వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు meekosam.ap.gov.inగా వెబ్‌సైట్ ద్వారా తమ ఫిర్యాదులు, అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు.

# సముద్రంలో మునిగిపోతున్న యువకుడిని రక్షించిన బాపట్ల రూరల్, మెరైన్ పోలీసులు



**బాపట్ల ( పెన్ పవర్ ) జూన్ 14** బాపట్ల సూర్యలంక బీచ్ లో ఆదివారం మధ్యాహ్నం సుమారు 01:45 గంటల సమయంలో, బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం, గ్రామానికి చెందిన కంబం కమల్ దాస్ (17 సంవత్సరాలు) తన నలుగురు స్నేహితులతో కలిసి సూర్యలంక బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లాడు. ఆ సమయంలో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండటంతో, అతడు ప్రవాహానికి లోతైన నీటిలోకి కొట్టుకుపోయాడు.

ప్రమాదంలో చిక్కుకున్న ఆ యువకుడి స్నేహితులు సహాయం కోసం కేకలు వేయగా, అక్కడ విధుల్లో ఉన్న మెరైన్ మరియు బాపట్ల రూరల్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వారు తక్షణమే స్పందించి లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్‌ల సహాయంతో సముద్రంలోకి వెళ్లి, ప్రాణాలకు తెగించి ఆ యువకుడిని సురక్షితంగా రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించి యువకుడి ప్రాణాన్ని కాపాడిన హోంగార్డులు నాయుడు శ్రీనివాసరావు, పెసికం రమేష్, ఈతగాళ్ళు మరియు మెరైన్, బాపట్ల రూరల్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించారు.


# "స్పందన"లేని"పిజిఆర్ఎస్"


పెన్ పవర్ PEN POWER
ప్రభుత్వ స్థలానికి ఎసరు -ట్రేడ్ లైసెన్స్ తో దర్జాగా కబ్జా


- సార్ మీ సమస్య పరిష్కరించాం! వాట్సాప్ ద్వారా ఎండార్స్మెంట్ పంపుతున్నాం!
- వారు పట్టించుకోరు వీరు పరిష్కరించరు -ఇది పిజిఆర్ఎస్ పట్ల అధికారుల తీరు
- "ప్రభుత్వ స్థలానికి ఎసరు- ట్రేడ్ లైసెన్స్ తో దర్జాగా కబ్జా"
- 13 వ వార్డులో ప్రభుత్వ స్థలాలకు రక్షణ ఏది! ఆక్రమణదారులకు నాయకుల అండదండలు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 14:** సార్ మీ పేరు , , ,! మేము జీవీఎంసీ నుండి మాట్లాడుతున్నాం మీరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు ఇచ్చియున్నారు మీరు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కరించారా? సంబంధిత అధికారులు మీతో మాట్లాడారా? అంటూ జీవీఎంసీ నుండి పి జి ఆర్ ఎస్ అధికారులు ఫిర్యాదుదారులకి వస్తున్న ఫోన్ కాల్స్, అంతవరకు బానే ఉంది కానీ సచివాలయ పరిధిలో పిజిఆర్ఎస్ ఫిర్యాదుదారునికి సంబంధింత అధికారులు ఫోన్ చేసి మీ సమస్యను పరిష్కరించాము,మీకు సంబంధించిన ఎండార్స్మెంట్ మీకు వాట్సప్ ద్వారా పంపిస్తున్నాము.అంటూ ఫిర్యాదుదారుని ప్రమేయం లేకుండానే అధికారులు సమస్యను పరిష్కరించాము అంటూ కాల్ చేసి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదానికి తెలియజేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారి వేదికలో ప్రభుత్వ స్థలాలను కాపాడడంటూ ప్రభుత్వ ఆస్తులను ఆస్తులకు రక్షణ కల్పించిన అంటూ పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆక్రమణదారులకు అండగా స్థానికనాయకులు,అధికారులు కొమ్ముకాస్తుండడంతో ఎన్నిసార్లు పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోనే అధికారులు లేకపోవడంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీజిఆర్ఎస్ కు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. పిజిఆర్ఎస్ లో ఎక్కువగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ప్రభుత్వా ఆస్తులకు రక్షణ కల్పించండి అంటూ స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వ స్థలాలను కాపాడవేసిన అధికారులకు ఇదేమి పట్టనట్టు వ్యవహరించడం పి జి ఆర్ ఎస్ పట్ల ప్రజలకు నమ్మకం లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 13 వ వార్డులో శివాజీ నగర్ టు పరిసర ప్రాంతాలలో ట్రేడ్ లైసెన్స్ చూపించి దర్జాగా కబ్జా చేసి వ్యాపారం కొనసాగిస్తున్న స్థలాన్ని ప్రభుత్వ స్థలం గా బోర్డు పెట్టాలని అదే




PUBLIC GRIEVANCE REDRESSAL SYSTEM (PGRS)
ENDORSEMENT

ప్రాంతంలో ప్రభుత్వ భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ స్థలాలను ప్రజల అవసరాల మేరకు ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణదారుల నుండి స్థలాలను స్వాధీనపరుచుకొని ప్రజల అవసరాలు మేరకు ఉపయోగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బత్తుల శ్రీనివాసరావుకు కోన రఘుపతి నివాళులు


**కర్లపాలెం,:( పెన్ పవర్ ) జూన్ 14** కర్లపాలెం మండలం పెద గొల్లపాలెం గోపాలమిత్ర బత్తులవారిపాలెం గ్రామ వైఎస్సార్సీపీ నాయకుడు బత్తుల శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న బాపట్ల మాజీ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి బత్తులవారిపాలెం గ్రామానికి చేరుకుని శ్రీనివాసరావు భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని బత్తుల శ్రీనివాసరావుకు నివాళులర్పించారు.



# కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు-తెలుగు మహిళలు




**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14:** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలుగు మహిళా నాయకులు పేర్కొన్నారు.ఆదివారం కాకినాడలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సునీత రమేష్,నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి, 22వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పీర్ల లక్ష్మీ ప్రసన్న మాట్లాడారు.తుమ్మల సునీత రమేష్ మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు.తల్లికి వందనం,స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లు,మెగా డీఎస్సీ, రైతు భరోసా, అన్న క్యాంటీన్లు, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయని అన్నారు.ప్రతిపక్ష వైసీపీ నాయకులు ప్రభుత్వ పనితీరును విమర్శించడం కంటే ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై ఆంక్షలు ఉండేవని, ప్రస్తుతం ప్రజాస్వామ్య వాతావరణంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి సహా పలు రంగాల్లో వేగవంతమైన పురోగతి సాధ్యమైందని చెప్పారు.నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు కొప్పనాతి నాగకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు మహిళలకు ఆర్థికంగా తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు.పీర్ల లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ,మహిళల భద్రత, ప్రజల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో తెలుగు మహిళా నాయకులు వడిసెల దాలమ్మ, ముత్యాల రాణి,అయేషా, తిరిది ఎల్లయ్యమ్మ, పెదపాటి కుమారి, బత్తిన ఉమా,కుసుమ కుమారి,కోడూరి నీలిమ,పట్నాల రాఘవమ్మ,బుంగా నీలిమ, మాగంటి మంగ,రామలక్ష్మి, బెక్కం ఉమా,గొల్లపూడి మంగదుర్గ, నమ్మి సత్యవాణి,రమ్య,లంక నాగమణి తదితరులు పాల్గొన్నారు.




## అన్నవరం దేవస్థానంలో భక్తి శ్రద్ధలతో 'కోలాటం' కార్యక్రమం



**అన్నవరం, పెన్ పవర్ జూన్ 14**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం కోలాటం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువర్యులు ఏ. సురేష్ బాబు గారి ఆధ్వర్యంలో విచ్చేసిన ద్వారపూడికి చెందిన 'కల్యాణ సీతారామ చంద్రమూర్తి స్వామి కోలాటం బృందం' ఈ ప్రదర్శన ఇచ్చింది.

?స్వామివారి సన్నిధిలో భక్తి పారవశ్యంతో కోలాటం బృందం ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు, దరువులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనతో అన్నవరం క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత సంతరించుకుంది.

?బృంద సభ్యులకు అభినందనలు:

?ఈ విశేష కోలాటం కార్యక్రమాన్ని దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి (ఈఓ) నల్లం సూర్యచక్రధర్ రావు మరియు ధర్మకర్త మండలి సభ్యులు వై.బాబ్జి గారు స్వయంగా వీక్షించారు. అనంతరం కోలాటం బృంద సభ్యులను వారు ప్రత్యేకంగా అభినందించారు. మన భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భవిష్యత్ తరాలకు అందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

?కార్యక్రమం ముగిసిన తర్వాత కోలాటం బృంద సభ్యులకు దేవస్థానం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం



**డాక్టర్ అడ్డాల సత్యనారాయణ**

**కాకినాడ, పెన్ పవర్ జూన్ 14:** గాయాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అత్యంత కీలకమైందని, అందువల్ల రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు.అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రతి ఏడాది జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తారని ఆయన అన్నారు. మానవ శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుందని, శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు వ్యర్థ పదార్థాలను బయటకు పంపించడంలో ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తుందని వివరించారు.యుక్తవయస్సు నుంచి 60 సంవత్సరాల వయస్సు వరకు ఆరోగ్యవంతులు వైద్యుల సూచనల మేరకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం వల్ల దాత ఆరోగ్యానికి ఎటువంటి హాని ఉండదని, అవసరమైన సమయంలో అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలుమార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ఏ.వి. శ్రీనివాసరావు, పి.శివకుమార్‌లను ఘనంగా సత్కరించి అభినందించారు.కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్,నిమ్మకాయల వెంకటేశ్వరరావు,బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రపహార్‌లో కాకినాడ జిల్లా పోలీసుల విస్తృత తనిఖీలు


**కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో 30 మోటార్ సైకిళ్లు సీజ్**





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14:** శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ లక్ష్యంగా కాకినాడ జిల్లా పోలీసులు ఆదివారం "ఆపరేషన్ వజ్రపహార్"లో భాగంగా భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాల గుర్తింపు, అక్రమ వలసదారులు,అనుమానాస్పద కదలికలు,గంజాయి,నాటుసారాయి వంటి అక్రమ నిల్వల గుర్తింపు కోసం ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.పెద్దాపురం కోట ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ వై.ఆర్.కె. శ్రీనివాస్,ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించగా,కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచర్లపేట ప్రాంతంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పలనాయుడు,త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్.సత్యనారాయణ,వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి. నాగదుర్గారావు నేతృత్వంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా సరైన పత్రాలు లేని వాహనాలపై చర్యలు తీసుకున్నారు. పెద్దాపురం పోలీసులు 6 మోటార్ సైకిళ్లను,కాకినాడ టూ టౌన్ పోలీసులు 24 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. మొత్తం 30 మోటార్ సైకిళ్లు సీజ్ చేశారు.అదేవిధంగా స్థానిక ప్రజలకు సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ,మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.అత్యవసర పరిస్థితుల్లో 112 టోల్‌ఫ్రీ నంబర్‌ను,గంజాయి తదితర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు 1972 నంబర్‌ను,సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు.ఈ ప్రత్యేక ఆపరేషన్ ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

## అన్నవరంలో అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవ సేవ



**అన్నవరం పెన్ పవర్ జూన్ 14:**కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఆదివారం స్వామి వారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా, కనులపండువగా నిర్వహించారు.

ఈ విశేష సేవలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్ణీత రుసుముతో టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. రథోత్సవం సాగుతున్నంత సేపూ భక్తులు, స్థానిక గ్రామస్తులు రథంతో పాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు, దేవస్థానం అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## పలువురు మృతుల కుటుంబాలకు స్టాలిన్ బాబు పరామర్శ



**అంబాజీపేట, పెన్ పవర్, జూన్ 14:** పి గన్నవరం నియోజకవర్గంలోని ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలను వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు పరామర్శించారు. ఆయా కుటుంబాల వారికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతి చెందిన వారి ఆత్మ శాంతికి ప్రార్థించారు.అంబాజీపేట మండల వైయస్సార్ పార్టీ కార్యదర్శి ముత్తాబత్తుల సామ శేఖర్ తల్లి అనారోగ్యంతో మరణించడంతో ఆయనను ఓదార్చారు. అదేవిధంగా భార్యవియోగంతో బాధపడుతున్న దళిత నాయకులు నాగాబత్తుల నరసింహమూర్తి మరియు పులపకూర సత్య నారాయణ, కొంబత్తుల పవన్ లను పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ వసంత గోపాల్ రాజు, కోట హోమ కృష్ణ లను పరామర్శించి మృతుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మైలే ఆనందరావు, ఇసుకపట్ల శ్రీనివాసరావు, పాలమూరి హరిప్రసాద్, గోసంగి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆదిత్య విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు





**కాకినాడ, పెన్ పవర్,జూన్ 14:** విద్యార్థుల్లో నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపొందనకు భగవద్గీత బోధనలు ఎంతో ఉపయోగపడతాయని ఇస్కాన్ స్వామీజీ శ్రీ అనంత శేష దాసు పేర్కొన్నారు.ఆదివారం కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల్లో భాగంగా కొప్పవరంలోని ఇస్కాన్ ఆలయంలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భగవద్గీత కేవలం ఆధ్యాత్మిక గ్రంథం మాత్రమే కాకుండా జీవితాన్ని సక్రమంగా నడిపించే మార్గదర్శకమని అన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని విజయాలు సాధించాలంటే గీతా బోధనలను ఆచరణలో పెట్టాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ నైపుణ్యాలు, ఒత్తిడి నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భగవద్గీతలోని శ్లోకాల భావాన్ని సులభంగా వివరించి, వాటి ద్వారా వ్యక్తిత్వ వికాసానికి కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.సత్వ, రజో, తమో గుణాల గురించి వివరిస్తూ, సత్వగుణాన్ని పెంపొందించే ఆహార అలవాట్లు, జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. దైనందిన జీవితంలో ఏకాగ్రత పెరగాలంటే ధ్యానం తప్పనిసరి అని పేర్కొన్నారు.విద్యార్థులకు నైతిక విలువలను బోధిస్తున్న స్వామీజీకి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, అధ్యాపకులు కావ్యశ్రీ, సుభాషిణి,సుమశ్రీ, భక్తులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

